క్లుప్తంగా

పొలంబాట



రాయపర్తి : మండలంలోని మహబూబ్‌నగర్‌లో విద్యుత్ శాఖ అధికారులు గురువారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయించారు. లూజ్ లైన్లు ఉన్న చోట్ల మిడిల్ పోల్‌లు, 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ వర్ధన్నపేట ఏడీఈ నటరాజ్ మాట్లాడారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ విక్రమ్, లైన్‌మెన్లు వెంకన్న, ప్రవీణ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలే లక్ష్యం



గీసుకొండ : శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యమని స్థానిక ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూ సంబంధిత, ఆర్థిక సమస్యలు పోలీస్‌స్టేషన్‌లో పరిష్కరించబడవని తెలిపారు. సివిల్ వివాదాలను న్యాయస్థానాల్లో పరిష్కరించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నేరానికి పాల్పడినా, ఇతరులను కించపర్చేలా లేదా రెచ్చగొట్టినట్టు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయం, తదితరాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ప్రజలకు కోరారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేసి సాయం పొందాలని తెలిపారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు.

వీఓఏల ముందస్తు అరెస్ట్



సంగెం : జీతాల పెంపు కోసం హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు వెళ్లకుండా మండలానికి చెందిన వీఓఏలు ప్రభాకర్, శ్రీనివాస్, సువర్ణ, విజయ, తదితరులను ఎస్సై వంశీకృష్ణ గురువారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిని సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

మండల కమిటీ ఎన్నిక

నెక్కొండ : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (బీఏఎస్) విద్యార్థుల పేరెంట్స్ మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు కందిక చెన్న కేశవులు గురువారం ఒక ప్రకటనలో మీడియాకు వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా జీడీ ప్రసాద్, కార్యదర్శిగా నేతావతు వీరన్న, కోశాధికారిగా దాసరి యాదగిరి, ఉపాధ్యక్షులుగా జన్ను అశోక్, బానోతు మోహన్, పాపావతు సుజాత, ఈదునూరి గణేశ్వరి, సహాయ కార్యదర్శులుగా మాలోతు లక్ష్మణ్, బానోతు వెంకన్న, మూలం కల్యాణి ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

'సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నం సరికాదు'

పర్వతగిరి : చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ) జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడానికి యత్నించడం సరికాదని సమన్వయ కర్త గారె జయరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడారు. దాడిని మూర్ఖపు చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు జిల్లా శ్రీనివాస్, స్వేరోస్ సీనియర్ నాయకులు జంగిలి యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పర్వతగిరి : ఇటీవల కురిసిన వర్షానికి మక్కలు తడిచి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. మండలంలో అనేక మంది రైతులు రోడ్లపై మక్కలను ఆరబోయగా అకాల వర్షంతో తడిచి దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.2400 చొప్పున చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయని కారణంగా దళారులు రైతులకు క్వింటాకు రూ.1800 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు.

ఆర్థికసాయం

వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లికి చెందిన మల్యాల సంతోశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతడితో కలిసి 2001–02 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు బాధిత కుటుంబానికి గురువారం రూ.30 వేలు అందజేశారు. కార్యక్రమంలో పసుల మహేందర్, కీర్తి రాందాసు, గుంటి అనిల్‌కుమార్, ఇలబోయిన రమేశ్, తిరుపతి, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కల గుంపులు

● నిత్యం పలువురిపై దాడి

నెక్కొండ : ఒకప్పుడు ఇళ్లల్లో దొంగలు పడకుండా కుక్కలు పహారా కాసేవి. గొర్రెలు, మేకల మందల్లో కలిసి తిరుగుతూ తోడేళ్ల బారి నుంచి వాటిని కాపాడుతూ పశుపోషకులకు, కాపరులకు అండగా నిలిచేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి పోయింది. బాబోయ్ కుక్కల గుంపులు.. అంటూ జనం బెంబేలెత్తుతున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో 10–15 కుక్కలు గుంపుగా తిరుగుతూ జనంపై దాడి చేసిన ఘటనలు చోటు చేసుకుంటుండడం మండల ప్రజలను కలవరానికి గురి చేస్తోంది. పల్లెల్లోని పలు కాలనీల్లో కుక్కల సంఖ్య భారీగా పెరుగుతుండగా వాటిని నియంత్రించాల్సిన బాధ్యతను ప్రభుత్వం, అధికారులు విస్మరించడం వల్లే సమస్య నానాటికీ జఠిలమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని సుమారు 800–850 వరకు వీధి కుక్కలున్నట్లు సమాచారం. గడచిన రెండు నెలల్లో మండలంలో 64 మంది కుక కాటుకు గురైనట్లు వైద్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

నెక్కొండలో మరీ ఎక్కువ

నెక్కొండలో కుక్కల సంఖ్య మరీ ఎక్కువగా ఉంది. వారాంత సంత (అంగడి)కు వివిధ గ్రామాలు, తండాల నుంచి వచ్చే ప్రజల వెంట కుక్కలు వస్తూ తిరిగి వెళ్లకుండా స్థానికంగానే తిష్ట వేస్తున్నాయి. చికెన్, మటన్ షాపుల వద్ద, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో గుంపుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయి.

మాంసాహారానికి అలవాటుపడి..

గ్రామాల్లో కొన్ని చికెన్ సెంటర్లు, కోళ్ల ఫారాలతోనే సమస్య పెరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. కోళ్ల ఫారాల్లోని మృతి చెందిన కోళ్లను పల్లెల్లోని శివార్లలో పారవేస్తుండగా వాటిని తింటూ కుక్కలు మాంసహారానికి అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే కొందరు చికెన్ దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను ఆరుబయటే పడేస్తుండగా వాటి అలవాటు పడిన కుక్కలు అవి లభించని రోజుల్లో వీధుల్లో తిరిగే కోళ్లు, పశువులు, పంది పిల్లలపైనా దాడి చేస్తున్నాయి.

నియంత్రణ చర్యలు శూన్యం..

కుక్కల నియంత్రణకు అధికారులు చొరవ చూపడం లేదని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. కోర్టు నిబంధనల ప్రకారం గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కలను చంపకుండా బంధించి జన సంచారం లేని ప్రాంతాల్లో విడిచిపెట్టాల్సి ఉంది. కాగా మండలంలో ఆ దిశగా ఇప్పటి వరకు చేసిందేమీ లేదు. అలాగే కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసిన దాఖలాలూ లేవు.



వైఎస్సార్ సెంటర్‌లో సంచరిస్తున్న వీధి కుక్కల గుంపు

గుంపులుగా సంచారం



నెక్కొండలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. జనాన్ని వెంట పడి తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పలువురు కుక్క కాటుకు గురవుతున్నారు. అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– దాసరి శ్రీనివాస్, వ్యాపారి, నెక్కొండ

నివారణపై దృష్టి సారిస్తాం



గ్రామ పంచాయతీల పరిధిలో కుక్కలను చంపాలని, పట్టుకోవాలని ఆదేశాలు లేవు. సమస్య తీవ్రత ఉన్న గ్రామాల్లో కుక్కల నివారణపై దృష్టి సారిస్తాం. అవసరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించి సమస్య పరిష్కరించాల్సి ఉంది.

– ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ, నెక్కొండ

వేద పాఠశాలలు ఏర్పాటు చేయాలి

● సేవా సమితి చైర్మన్ వెంకటాచార్యులు

నర్సంపేట : సనాతన ధర్మ పరిరక్షణ కోసం వేద పాఠశాలలు ఏర్పాటు చేయాలని ధరణిశ్రీ ఫౌండేషన్ సనాతన ధర్మ పరిరక్షణ సేవా సమితి చైర్మన్ ముడుంబై వెంకటాచార్యులు ఆకాంక్షించారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన ఆలయ, వికాస తరంగిణి (వీటీ) కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, ఆలయ నిర్మాణ పనులు, వాస్తు విషయాలపై కమిటీతో చర్చించి సూచనలు చేశారు. పాఠశాల ఏర్పాటు కోసం హైదరాబాద్ సమీపంలో వరంగల్ దారిలో ఎకరం స్థలం కొనుగోలు చేయాల్సి ఉన్న క్రమంలో దాతలు గజానికి రూ.1250 చొప్పున ఐదు గజాలకు తక్కువ కాకుండా ధన రూపంలో సాయం చేస్తే అశ్వమేధ యాగం చేసిన ఫలితం, పితృదేవతలకు స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని తెలిపారు. దాతలు సెల్ నంబర్ 9885363710లో సంప్రదించాలని కోరారు. తొలుత వేద పాఠశాల ఏర్పాటు కోసం భూసేకరణ పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధరణిశ్రీ ఫౌండేషన్ అధ్యక్షుడు చందనవెళ్లి నర్సింహారావు, సభ్యుడు శ్రావణ్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దుబ్బ రమేశ్, కార్యదర్శి వేమిశెట్టి శ్రీనివాస్, శింగిరికొండ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకటాచార్యులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కీలకం

● పంచాయతీ కార్యదర్శి రాజు

నర్సంపేట రూరల్ : బ్యాంకు ఖాతాదారుల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కీలకమని పాపయ్యపేట పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో ధరణి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి అధ్యక్షతన బ్యాంక్ లావాదేవీలపై గురువారం నిర్వహించిన కార్యక్రమానికి రాజు హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సంపాదించిన డబ్బు నుంచి కొంత పొదుపు చేసుకోవాలని సూచించారు. పొదుపు చేసుకుంటూ అవసరం మేరకు మాత్రమే ఖర్చు చేసుకోవడాన్ని ఆర్థిక అక్షరాస్యతగా అభివర్ణించారు. బ్యాంక్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎఫ్ఎల్‌సీ కోఆర్డినేటర్ భాస్కరాచారి తెలిపారు. సైబర్ క్రైమ్ రిసోర్స్‌పర్సన్ రమేశ్, సెర్ప్ సీసీ మాణిక్యం, మండల సమాఖ్య కార్యదర్శి మాధవి, అనుచందన, ప్రమీల, లావణ్య, యమున, భావన, కీర్తన, గణేశ్, రాజేందర్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న సుదర్శన్‌రెడ్డి, తదితరులు

● మాజీ జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి

సంగెం : గత ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గవిచర్ల, షాపూర్, లోహిత, పెద్దతండా, రామచంద్రాపురం, ఆశాలపల్లి, కాపులకనిపర్తి, కాట్రపల్లి, కుంటపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో ఒకటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, విసిగిపోయారని తెలిపారు.

కాంగ్రెస్ నుంచి చేరిక

మండలంలోని కుంటపల్లికి చెందిన పాశం రాజు, రావుల రమేశ్, బండ రాజ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, నాయకులు జక్క మల్లయ్య, సాగర్‌రెడ్డి, సమ్మయ్య, బాలకృష్ణ, వీరేశం, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన అలవాట్లతోనే ఉన్నతి

ఖానాపురం : మెరుగైన అలవాట్లతోనే జీవితంలో ఉన్నతి సాధించగలరని మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్ట్ దామోదర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన సామాజిక సంస్కార విద్యా వికాస ప్రేరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ అలవాట్లు చేసుకోవాలని చెప్పారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని, లక్ష్యాన్ని ఎంచుకుని సాధన దిశగా ప్రయత్నించాలని చెప్పారు. సమావేశంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి యుగేందర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం, అధ్యాపకులు రవికుమార్, సదానందం, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మగౌరవంతో రాజకీయం'

వర్ధన్నపేట : బీసీల ఆత్మగౌరవంతో బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం అన్నారు. పట్టణంలో గురువారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేస్తుండగా బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు మద్దతు కోరుతూ కలిసిన సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు బీసీలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయన్నారు. బీసీల పక్షాన పోరాడే ఆలోచన ఉంటే పిటిషన్‌లో ఇంప్లీడ్ కావాలని బీసీ సమాజం కోరినా ఎందుకు అవ్వలేదో కేటీఆర్ చెప్పాలన్నారు.

రాస్తారోకో



నల్లబెల్లి : బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి పంపించినా బిల్లును 9 షెడ్యూల్‌లో చేర్చి ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమించాలని కోరారు. బంద్‌కు వ్యాపార, వాణిజ్య వర్గాలతోపాటు ఉద్యోగులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూస కుమారస్వామి, రాజన్న, రాపర్తి సంపత్, మాటేరి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

9వ షెడ్యూల్‌లో చేర్చాలి



నర్సంపేట : బీసీ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి రక్షణ కల్పించాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ అధికారికి గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లును నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు జావిద్, నాయకులు మహబూబ్ అలీ, గుంటి రాంచందర్, బొనగాని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కుట్ర



ఖానాపురం : బీసీ రిజర్వేషన్లపై కుట్ర జరుగుతోందని బీసీ జేఏసీ మండల ఇన్‌చార్జి బందారపు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఐక్యంగా పోరాడాలని కోరారు. సమావేశంలో బీసీ సంఘం బాధ్యులు రాజేందర్, శ్రీ శైలం, శ్రీనివాస్, సుధాకర్, ఆబోతు అశోక్, పులిగిల్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి అరుదైన చికిత్స



వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో దివ్యాంగురాలికి అరుదైన పంటి చికిత్స చేసినట్టు సూపరింటెండెంట్ నర్సింహస్వామి తెలిపారు. పట్టణానికి చెందిన పేద వికలాంగురాలు రజిత వీల్‌చైర్‌కు పరిమితమైందని, నరాల బలహీనతతోపాటు ఫిట్స్ బాధితురాలని తెలిపారు. ఆమె పళ్లు పుచ్చిపోయి ఇబ్బంది పడుతుండగా ఫిజీషియన్ డాక్టర్ హరీశ్ సలహా మేరకు పరీక్షలు నిర్వహించి దంత వైద్య నిపుణుడు భరత్‌రెడ్డి, డాక్టర్ అపర్ణ ఓపెన్ ఎక్స్‌ట్రాక్షన్ పద్ధతిలో నొప్పి లేకుండా పుచ్చిపోయిన పళ్లను తొలగించినట్టు తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న సీడీపీఓ



ఖానాపురం : సీమంతం చేస్తున్న అధికారులు



నెక్కొండ : పోషకాహారం అందిస్తున్న భాగ్యమ్మ

● సీడీపీఓ మధురిమ

నర్సంపేట రూరల్ : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయన్‌పహాడ్ సెక్టార్ సూపర్‌వైజర్లు రాధ, పారిజాతం ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు ప్రొటీన్లు, విటమిన్లతో కూడిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ కోఆర్డినేటర్లు శ్రీలత, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలతో ఆరోగ్యం

ఖానాపురం : ఆహారంలో ఆకుకూరలు అధికంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి మధురిమ, సూపర్‌వైజర్లు రమ, మాధవి, వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి

నెక్కొండ : అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ కోరారు. మండలంలోని పనికరలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో దీక్షకుంట, రెడ్లవాడ సూపర్‌వైజర్లు హేమలత, నజ్మా, ఏఎన్ఎం సరిత, లావణ్య, హర్షిత, తదితరులు పాల్గొన్నారు.

రేపటి తెలంగాణ బంద్‌కు సహకరించాలి



నర్సంపేట : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, నాయకులు

● సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

నర్సంపేట : రేపు (ఈనెల 18న) తలపెట్టిన తెలంగాణ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని అమరవీరుల జంక్షన్‌లో బంద్ పోస్టర్లను నాయకులతో కలిసి శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ శ్రేణులు రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొని ఐక్యత చాటాలని సూచించారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి, జిల్లా అధికార ప్రతినిధి మరుపల వీరస్వామి, జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేశ్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు శ్యామ్‌కుమార్, రజక సంఘం అధ్యక్షుడు కొల్లూరి లక్ష్మీనారాయణ, నాయకులు రామగోని సుధాకర్ గౌడ్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, మహిళా మండల అధ్యక్షురాలు బండి విజయ, విశ్వబ్రాహ్మణ సంఘం డివిజన్ అధ్యక్షుడు సురేందర్‌చారి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుంటి సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలూ మద్దతు తెలపాలి

బంద్‌కు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు మద్దతు తెలపాలని బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ కోరారు. పట్టణంలోని సర్వాయి సర్దార్ పాపన్న విగ్రహం వద్ద నియోజకవర్గ బీసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో నియోజకవర్గ కేంద్రంగా అనేక పోరాటాలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీసీ పవర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మోడెం రామకృష్ణ, జిల్లా యూత్ అధ్యక్షుడు సంగినేని లకన్‌కుమార్, నాయకులు కుమారస్వామి, సాంబయ్య, రవి, బల్ల సురేశ్, సతీశ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు

నర్సంపేట/నెక్కొండ : అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, పార్టీ నెక్కొండ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య తెలిపారు. నర్సంపేటలో, నెక్కొండలో వేర్వేరుగా గురువారం నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. అశాస్త్రీయ విధానాలతో కాంగ్రెస్ బీసీలకు అన్యాయం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను రాజకీయ స్వార్థానికి ఉపయోగించుకుంటున్నాయని చెప్పారు. పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలన్నారు. బీసీలందరూ పాల్గొనాలని కోరారు. నెక్కొండలో నిర్వహించిన సమావేశంలో నాయకులు కొమ్ము రమేశ్, బొల్లెబోయిన వీరస్వామి, తోట సాంబయ్య, మాదాసు రవి, కారింగుల సురేశ్, దేవనబోయిన వీరభద్రయ్య పాల్గొన్నారు.



నెక్కొండ : మాట్లాడుతున్న సూరయ్య

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మద్దతు

నర్సంపేట : ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డం సదానందం వెల్లడించారు. బంద్ విజయవంతానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఎయిడ్స్ రోగులను సమాజం ఆదరించాలి



నల్లబెల్లి : ఎయిడ్స్ రోగులను ప్రతిఒక్కరూ ప్రేమతో ఆదరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పీబీ ఆచార్య, వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్పీ ముస్తాక్ కోరారు. మండల కేంద్రంలో లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై గురువారం నిర్వహించిన ర్యాలీని వారు ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య తెలంగాణ సాధనకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎయిడ్స్ నిర్మూలన కోసం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధులు సామల వీరన్న, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంత పూడ్చివేత



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ గ్రామ శివారులో రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పోలీసులు గురువారం పూడ్చి వేయించారు. రెండ్రోజుల క్రితం నర్సంపేట మండలంలోని నర్సింగపురం గ్రామానికి చెందిన రాజేందర్ అనే ద్విచక్ర వాహనదారుడు ప్రమాదవశత్తు ఆ గుంతలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మళ్లీ ప్రమాదాలు చోటు చేసుకోకుండా హెడ్ కానిస్టేబుల్ జంపయ్య, కానిస్టేబుళ్లు వీరస్వామి, సీతారామరాజు ఆధ్వర్యంలో గుంతను శాశ్వత ప్రాతిపదికన సిమెంట్ కాంక్రీట్‌తో పూడ్చి వేయించారు.